విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 6, జూన్ 2025

బాల్య వివాహాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర–ఉరవకొండ: బాల్య వివాహాల నివారణ పై రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పావని ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో బాల్య వివాహాల నిరోధక చట్టం మరియు పి సి పిఎన్డి చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని మాట్లాడుతూ అమ్మాయిల వయస్సు 18 సంవత్సరాలు నిండాకే పెళ్లి చేయాలని అంతకంటే తక్కువ వయసులో పెళ్లిచేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాల వలన అమ్మాయి చదువుతో పాటు ఆరోగ్యం పాడవుతుందని అన్నారు. బాల్య వివాహాలు చిన్న వయసులోనే గర్భధారణకు కారణం అవుతుందని అంతే కాక పుట్టబోయే పిల్లలపై ప్రభావం చూపుతుందని అన్నారు. చనిపోయిన పిల్లలు పుట్టడం, పుట్టిన తర్వాత కూడా చనిపోవడం తక్కువ బరువుతో పుట్టడం లాంటివి జరగవచ్చునని అన్నారు. కొంతమంది గర్భస్థ లింగనిర్ధార పరీక్షలు నిర్వహించి గర్భంలో ఉన్నది ఆడశిశువు అయితే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఇది కూడా చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్వైజర్ శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

కౌలు రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి..

వజ్రకరూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

విశాలాంధ్ర–ఉరవకొండ: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం వజ్రకరూరు మండలానికి చెందిన కౌలు రైతులు వజ్రకరూరు తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా నాయకులు వెంకటేష్ వ్యవసాయ కార్మికు సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి రైతు సంఘం జిల్లాఉపాధ్యక్షుడు విరుపాక్షి మాట్లాడుతూ కౌలు రైతులు ఎకరాకు ముందస్తు గుత్త 50 వేల రూపాయలు చెల్లించి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తూ ప్రజలకు ఆహార ధాన్యాలు కొరతను తీరుస్తున్నారని ఇలాంటి కౌలు రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి రక్షణ లేదని అందువలన వెంటనే ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను పరిష్కరించి కౌలు రైతులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. వీరికి రైతు అనుమతి తప్పనిసరి చేస్తూ చేసిన సిసిఆర్సి 2019 చట్టం కౌలు రైతు ల పాలిట శాపంగా మారిందని అలాగే సిసిఆర్సి కార్డు లేనందువలన ప్రభుత్వ రికార్డులో కౌలు రైతుల పేరు కుండా నమోదు కావడం లేదన్నారు. పురుగులు మందులు, విత్తనాలు పండిన పంటకు మార్కెట్ సౌకర్యం గిట్టుబాటు ధర కల్పించాలని ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు షరతులు లేకుండా గ్రామ పంచనామ ఆధారంగా రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన కౌలు చట్టం అమలు చేసే కౌలు రైతులందరికీ గ్రామ సభల ద్వారా సీసీఆర్సీ ఇవ్వాలని, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని సిసిఆర్సి ఉన్న కౌలు రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు పురుగు మందులు బ్యాంకు ద్వారా పంట రుణాలు ఇవ్వాలని ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ఎటువంటి షరతులు లేకుండా 10 లక్షలు పరిహారం ఇవ్వాలి పండిన పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించి గిట్టుబాటు ధర కల్పించాలి భూమిలేని నిరుపేదలకు కౌలుకి ఇవ్వాలి దేవాలయ భూముల్లో సాగులో గతం నుండి ఉన్న వారసులకే కౌలుకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్, నాయకులు సుంకన్న, చెన్నయ్య, సుంకన్న, సీనా ధనంజయ, పెద్దన్న, గౌరమ్మ, సుధాకర్ దండోరా నాయకులు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మెగా డీఎస్సీ నిర్వహనకు పకడ్బందీ ఏర్పాట్లు ..

జిల్లాలో 7 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర–అనంతపురం : ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించే మెగా డీఎస్సీ-2025 నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా డీఎస్సీ జూన్ 6వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు జిల్లాలో ఏడు కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుండగా, అనంతపురం నగరంలో ఐదు కేంద్రాలు, గుత్తి, తాడిపత్రి పట్టణాల్లో ఒక్కో కేంద్రం చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 02:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని, డీఎస్సీ నిర్వహణ కోసం డీఆర్ఓని ఇంచార్జ్ అధికారిగా నియమించామని, ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లను ఇంచార్జ్ అధికారులుగా నియమించా లని కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్లు ప్రతిరోజు పరీక్ష కేంద్రాలకు వెళ్లి తనిఖీ చేయాలని, తాను కూడా యాదృచ్ఛికంగా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తానన్నారు. ఆ పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించా లన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, సైన్ బోర్డ్స్ ఉండాలన్నారు. పరీక్షల కోసం కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, డీఎస్సీ వెంకటేశులు, డీఈఓ ప్రసాద్ బాబు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీఎంహెచ్ఓ కార్యాలయం ఏఓ గిరిజ మనోహర్రావు, ఏపీఎస్ ఆర్టీసీ సూపరింటెండెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

కొల్లాపూ రీ మహాలక్ష్మి దేవి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర–బొమ్మనహాల్: మండలంలోని తారక పురం గ్రామంలో వెలసిన కొల్లాపూర్ మహాలక్ష్మి దేవి ఆలయంలో నేటి నుంచి రెండు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు నెట్టెం నరేంద్ర తెలిపారు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉదయం సుప్రభాత సేవ పంచామృత అభిషేకం ఆకు పూజ వస్త్రాలంకరణ గంగపూజ మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తులకు అన్నదాన కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు కొల్లాపూర్ మహాలక్ష్మి దేవి రథోత్సవం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

విశాలాంధ్ర–అనంతపురం: గ్రంథాలయాలలో విద్యార్థులు, పాఠకులు పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానాన్ని సంపాదించు కోవచ్చని రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు అన్నారు. రాప్తాడు గ్రంథాలయాలయ అధికారి వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. నేటి చరిత్ర భావితరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి ఆదినారాయణరెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇంటిస్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర–గుంతకల్లు: పట్టణంలో నిరుపేద షెడ్యూల్డ్ కులాల చెందిన వారికి నివేశ స్థలాలు ఇవ్వాలని రాయలసీమ దళిత సంఘం అనంతపురం జిల్లా యువజన అధ్యక్షులు బండారి సురేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుంతకల్లు మండల డిప్యూటి తహశీల్దార్కు రాయలసీమ దళిత సంఘం జిల్లా యువజన అధ్యక్షులు బండారి సురేంద్రబాబు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి అద్దెలు కట్టలేక చాలీచాలని కూలిల డబ్బులుతో జీవనం సాగిస్తూ మరింత పేదవారిగా మారిపోతున్నారు అని అన్నారు. అర్హులైన వారి కి ఇల్లు స్థలాలు కేటాయించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ దళిత సంఘం గుంతకల్లు టౌన్ ప్రెసిడెంట్ మణిశంకర్ పాల్గొన్నారు.

హెచ్ ఎల్సి డిఈ దివాకర్ రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర–కణేకల్లు: మండలం లో హెచ్.ఎల్.సి ఆఫీస్లో నూతన డి.ఈ, దివాకర్ రెడ్డిని టీడీపీ కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు పూలహారం వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు క్లస్టర్ ఆనంద్ రాజు, మండల కన్వీనర్ లాలెప్ప, కవిటి మాబు, బిటి రమేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంను ఢీకొన్న బస్సు

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు క్రాస్ సమీపంలో మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన దేవరాజు,దేవమ్మ వీరి కుమారుడు నాగేం ద్రలు ద్విచక్రవాహనంలో బళ్లారి వైపు వేళ్తుండగా ఓ ప్రైవేట్ బస్సు బళ్లారి వైపు నుండి కళ్యాణదుర్గం వైపు వేళ్త ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దేవమ్మకు చెయ్యి విరుగగా, ఏడేళ్ల నాగేంద్రకు కాలు విరిగింది. స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్కు తరలించారు. బస్సు డ్రైవర్ పరారయ్యారు. బళ్లారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు.

బీ. టెక్ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర–జేఎన్టీయూఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం పరిధిలో ఏప్రెల్లో నిర్వహిం చిన పరీక్షలు బీ. టెక్ రెండవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్ ఫలితాలు, బీ. టెక్ రెండో సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ. టెక్ రెండవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్23), (ఆర్20), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఆచార్య ఎ.పి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ డాక్టర్ ఎం.అంకారావు, డా శ్రీధర్ ఫలితాలను విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను జెఎన్టియు వెబ్సైట్లో తెలుసుకోవచ్చని సూచించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర–యాడికి : గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీ జాతీయ ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాడికి మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన కార్తీక్(20) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుత్తిలో ఓ వివాహానికి హాజరై తిరిగి తమ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతుండగా కొత్తపేట వద్ద లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం లారీ కింద పడి నుజ్జునుజ్జు అయ్యింది. మృతుడు బేల్దారి.

పర్యావరణ పరిరరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర–గుత్తి: పట్టణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం హరితాంధ్రప్రదేశ్ లో భాగంగా మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా ఆధ్వర్యంలో గుత్తి పురపాలక సంఘము అధికారుల బృందం అధ్యక్షతన ర్యాలీ, ప్రతిజ్ఞ, చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ జబ్బర్ మియా మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులుగా క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు, పర్యావరణ అనుకూల వాడుకోవాలని గుత్తి మునిసిపల్ పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ ద్వారా అవగాహన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ హేమచంద్ర , మేనేజర్ రాంబాబు,శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాషా, ఆర్.ఓ సతీష్ కమలాకర్,మునిసిపల్ అధికారులు, సిబ్బంది, గేట్స్ కాలేజ్ ఛైర్మెన్ పద్మావతమ్మ,బిజెపి గుంతకల్ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు బీసీ వెంకప్ప, ప్రధాన కార్యదర్శి నూరుల్ హసన్ బాషా పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర–తాడిపత్రి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని ఎంపీడీవో శకుంతలమ్మ పేర్కొన్నారు. గురువారం పెద్ద పప్పూరు మండలం జూటూరు గ్రామ సమీపంలో ఉన్న కస్తూరిబా పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో శకుంతలమ్మ హాజరయ్యారు. మొదట పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఏపీవో గంగరాజు జూటూరు కేజీబీవీ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్పల పంచాయతీ కార్యాలయంలో..

విశాలాంధ్ర–నార్పల: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మొక్కలను నాటారు. ప్రత్యేకించి పాత్రికేయులు మొక్కలు నాటడం గమనార్హం. అనంతరం పంచాయతీ కార్యాలయం నుండి దుగుమర్రి రోడ్డు వరకు ర్యాలీనిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. పంచాయతీ సిబ్బంది, గ్రామ సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

విశాలాంధ్ర–గుంతకల్లు: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ కాపాడుకుందామని బిజెపి పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ అన్నారు. గురువారం స్థానిక కసాపురం రోడ్డు దుర్గమ్మ గుడి వెనక శివాలయం దగ్గర మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మోడీ పిలుపు మేరకు జూన్ 5 నుండి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరు తమ మాతృ మూర్తి అమ్మ పేరుతో ఒక మొక్క నాటి దాన్ని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుకుందాం అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు ,మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగుంది విజయలక్ష్మి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంతా సహకరించాలి

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ, మండలపరిషత్, క్రిస్టాల్ కంపెని అధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు నేమకల్లు, దేవగిరిక్రాస్, బండూరు, గోవిందవాడ తదితరగ్రామాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అంతా సహకరించాలి అని పిలుపునిస్తు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీప్యూటీ ఎంపీడీఓ దాస్, డీటీ శ్యామ్, ఏపీఎం రామకృష్ణ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ బాలక్రిష్ణ, సర్పంచ్ పరమేష్, విఆర్ఓలు పాల్గొన్నారు.

నాటి మొక్కలే నేటి మహావృక్షాలు

విశాలాంధ్ర–శింగనమల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహి నాథ్. పంచాయతీ కార్యదర్శి లీలారాణితో కలిసి టిడిపి నేతలు నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు మొక్కలు నాటారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహినాథ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యం, పర్యావరణాన్ని కాపాడటానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటీ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను నివారించి, బయోడిగ్రే డబుల్ బ్యాగులు వాడుదామని తెలిపారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో మొక్కలు దోహదపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకులు సి వెంకటేష్. చంద్రమోహన్. ప్రకాష్. నరేష్. నాగరాజు. కమ్యూనిటీ హెల్త్

గూగూడు ఆలయానికి చైర్మన్ ని ప్రకటించండి...

సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్

విశాలాంధ్ర–నార్పల: నార్పల మండలంలోని పుణ్యక్షేత్రమైన శ్రీ గూగుడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు కులమతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం మొహరం పీర్ల పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. పీర్ల పండుగ మహోత్సవానికి రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిగా జనం తరలివస్తారు. శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న శ్రీ గూగూడు దేవస్థానానికి ఛైర్మెన్ని నియమించకపోవడం అత్యంత దారుణమని మండల సిపిఐ కార్యదర్శి సాకే గంగాధర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో వచ్చిన భక్త జనానికి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తినమ్మ పోతినమ్మ అన్నట్లు గూగుడికి వస్తున్నారే కానీ ఆలయానికి ఒక చైర్మన్ నియమించకపోవడం ఎంతో సిగ్గుచేటని పేర్కొన్నారు. ఇప్పటివరకు గూగూడులో ఏర్పాట్ల గురించి పెద్దగా పట్టించుకునేదైతే లేదని ఎద్దేవా చేసారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని దేవాదాయ శాఖ వారితో సంప్రదింపులు చేసి చైర్మన్ని ఎంపిక చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శులు చాపల రామాంజి, సుధాకర్ పాల్గొన్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండండి..

ఎమ్మెల్యే దగ్గుపాటి

విశాలాంధ్ర–అనంతపురం: అనంతపురం నగరంలో తొలి కరోనా కేసు నమోదు కావడంతో వైద్య, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. తొలి కేసు నమోదైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బి.దేవి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ బాలాస్వామితో ఫోన్ లో మాట్లాడారు. కరోనాపై నగరంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలో ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం ఉండకూడదని.. డ్రైన్లు శు భ్రంగా ఉండాలన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శానిటరీ సిబ్బంది కాలనీల్లో పర్యటించాలన్నారు. కాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. అలాగే డీఎంహెచ్ఓ, సూపరింటెండెంట్ లు కరోనాపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కరోనా బాధితురాలి కాంటాక్టులను గుర్తించి.. తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ముందుగా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కరోనా వార్డులు, అందులో అన్ని సౌకర్యాలు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏదైనా అవసరం అయితే వెంటనే ఇండెంట్ పెట్టాలని.. తాను కూడా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, మంత్రితో మాట్లాడుతానన్నారు. ప్రజలు కరోనా విషయంలో ఆందోళన చెందవద్దని అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

ప్రైవేట్ వాహనదారుల మధ్య ఘర్షణ..

విశాలాంధ్ర–ఉరవకొండ : ఉరవకొండ నుంచి అనంతపురానికి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ వాహనదారులకు ఉరవకొండ పట్టణంలో అద్దెకు నడుపుతున్న ప్రైవేట్ వాహనదారులు మధ్య గురువారం ఘర్షణ జరిగింది. ఉరవకొండ అనంతపురం మధ్య దాదాపు 26 కార్లు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రయాణికులను గత ఆరు నెలలుగా తరలిస్తున్నారు. దీనివల్ల ఉరవకొండ పట్టణంలో ప్రైవేట్ వాహనదారులు తీవ్రంగా నష్టపోతు న్నారు. ఈ విషయంపై అనంతపురం కు కార్లు నడుపుతున్న వారు తక్షణమే నిలుపుదల చేయాలని కార్లు తిరగకూడదని గురువారం ఉరవకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్లను అడ్డుకున్నారు. దీనివల్ల ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా ఉరవకొండలో ప్రైవేటు అద్దె వాహనాలను నడుపుకుంటున్న డ్రైవర్లు, ఓనర్లు మాట్లాడుతూ ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ ముందు అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ముందర కార్లు పెట్టి ప్రయాణి కులను తిప్పుతున్న ఆర్టీసీ అధికారులు ఆర్టీవో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్థానికంగా ఉన్న ఉరవకొండ డ్రైవరు ఓనర్స్ మూడు నెలలకు గాను దాదాపు రూ.8,960 రోడ్ టాక్స్ చెల్లిస్తున్నామని ఉరవకొండ, అనంతపురం తిరిగే వాహనాలు దాదాపు 26 ఉన్నాయని ఈ బండ్ల వలన మాకు బాడుగలు లేక రోడ్ టాక్స్లు ఈఎంఐలు కట్టలేక కుటుంబ పోషణకు ఇబ్బందికరంగా మారిందని ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ బండ్ల వలన ఏపీఎస్ఆర్టీసీ కు దాదాపుగా సంవత్సరానికి మూడు కోట్ల 50 లక్షల రూపాయలు నష్టం కూడా వస్తుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అక్రమంగా కార్లను నడుపుతున్న వారిపై ఆర్టీసీ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా నడుపుతున్న కార్లను నిలపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఆర్టీసీ ఆర్టీవో స్థానిక పోలీసులు కూడా ఇందులో జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్రైవేట్ ఫైనాన్స్లో రుణమిప్పిస్తామని రూ.2.10 లక్షల టోకరా

విశాలాంధ్ర–గుంతకల్లు: మోసపోయిన బాధ్యులకు న్యాయం చేయాలని సిపిఐ కార్యాలయంలో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు వీరభద్ర స్వామి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రశాంతి నగర్ లో నివసించు షేక్ మహబూబ్ షరీఫ్ ప్రైవేటు కంపెనీ ఓఎం ఫైనాన్స్ లిమిటెడ్ అనే పేరుతో హైదరాబాదులో బ్యాంకు నుండి మీకు లోను ఇప్పిస్తానని నలుగురితో(సురేష్ ,పద్మావతి, వాసు, ఎస్ సాధిక్ వలి వారి నుంచి రెండు లక్షల పది వేల రూపాయలు అబద్ధాలు చెప్పి ఇప్పించుకుని నేటికి రుణాలు రాలేదని అన్నారు. మేము కట్టిన డబ్బులు వెనికి ఇమ్మంటే ఇవ్వడం లేదునీ వాపోయారు.మరియు మా పైనే లాయర్ నోటీసులు పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. అని నాయకునితో బాధను వ్యక్తపరి చారు. పోలీసులను ఆశ్రయించి. కేసు నమోదు చేసుకొని న్యాయం చేయమని కోరారు. ఈలాంటి మోసగాడిని పట్టణంలో ఎవరు నమ్మవద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం, బాధితులకు పోలీస్ అధికారులు న్యాయం చేయాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిపిఐ నాయకుడు జూటూరు బషీర్ను పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర–యాడికి: మండల కేంద్రానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జూటూరు బషీర్ గురువారం గుత్తి పట్టణంలో శుభకార్యానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న వైకాపా సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫీనివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.. ఆయనతో పాటు సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, దాసరి పాండు, వైసీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, శేఖర్ రెడ్డి పరామర్శించారు.

వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండలంలోని గ్రంథాలయంలో గురువారం ఏప్రిల్ 28 నుండి జూన్ 06వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారిని హెచ్.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు బొమ్మలు గీయడం, స్వచ్ఛ ఆంధ్ర మీద వ్యాసం రాయడం, క్విజ్, వివిధ రకాలైన పోటీలు నిర్వహించి ముఖ్యఅతిథి జడ్పీ.హెచ్.స్కూల్ ఉపాధ్యాయురాలు గాయత్రి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమా నికి, 24 విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఉషారాణి తెలిపారు.

ప్రమాణస్వీకారానికి తరలిరండి

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువ నేత, మంత్రి నారా లోకేష్ రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవశ్రీనివాసులు గారి ఆశీస్సులతో, యువనేత, భవిష్యత్ నేత కాలవ భరత్ సహకారంతో రాయదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్ గా ఈనెల 8వ తేదీన(ఆదివారం) ఉదయం 10 గంటలకు రాయదుర్గం మార్కెట్ యార్డు ఆవరణలో ఉండాల హనుమంత రెడ్డి కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయ బోతున్నారు. ఈ మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలను ప్రతీ ఒక్కరూ కార్యక్రమానికి హాజరై విజయ వంతం చేయాలని తెలిపారు.

పోలీస్ శాఖకు వంద బారికేడ్లు అందించిన కిమ్స్ సవీర ఆస్పత్రి

విశాలాంధ్ర–అనంతపురం: పోలీస్ విభాగానికి కిమ్స్ సవీర ఆస్పత్రి 100 బారికేడ్లను అందజేసింది. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ బారికేడ్లను జిల్లా ఎస్పీ పి. జగదీష్ కు అందజేసినట్లు కిమ్స్ సవీర ఆస్పత్రి సీఓఓ సిద్దారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ అనంతపురం పట్టణం మీదుగా, జాతీయ రహదారి వెళ్తుంది, అలాగే పట్టణంలో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి, ప్రమాదాలను తగ్గించడానికి బారికేడ్లు ఎంతగానే ఉపయోగపడతాయన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ వంద బారికేడ్లను అందించినందుకు కిమ్స్ సవీర ఆస్పత్రి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.

మొక్కలు నాటిన మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండలోని మిట్ట ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అధికారులు కూటమి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పర్యావరణం సమతుల్యంగా ఉండటానికి ఆక్సిజన్ పెంపొందించడానికి విరివిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ని నిషేధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణ పత్రాన్ని అందరి చేత చదివించారు అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోసి ట్రీ గార్డ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని చేపట్టినందున మహిళల పెద్ద ఎత్తున పాల్గొని ప్రతి ఇంటికి మొక్కలునాటాలని, పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో అనేకచోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు, కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, ఎంపీడీవో నరేష్ కృష్ణ, అటవీశాఖ సిబ్బంది, మున్సి పల్ కమిషనర్, కన్వీనర్లు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని ముత్తుకూరు కొంకల్లు కె.ఎన్.పల్లి గుడిబండ గ్రామపంచాయతీలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కేశవరెడ్డి మాట్లాడుతూ మానవ పర్యావరణ పరిరక్షణ మెరుగుదల అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజల శ్రేయస్సు ఆర్థిక అభివృద్ధి ప్రభావితం చేసే ఒక ప్రధాన సమస్య అని తెలుసుకున్న ఐక్యరాజ్యసమితి జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఇతివృత్తం జీవన వైవిధ్యం ఈ దినోత్సవ వేడుకలు వ్యక్తులు వ్యవస్థలు మరియు సమాచారం పర్యావరణ రక్షించుకోవడంలో పర్యావరణాన్ని పరీక్షించడంలో జ్ఞానోదమైన అభివృద్ధిబాధ్యతమైన ప్రవర్తన ఆధారాన్ని విస్తృతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ క్రమంలో మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణాన్ని రక్షించి మానవ మనుగడకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి గంగాధర్, ఉపాధి హామీ సిబ్బంది, ఏపీవో శివన్న,ఈసీ,జగదీష్ టెక్నికల్ అసిస్టెంట్లు లోకేష్, తిరుమల గౌడ్,పవిత్ర,సతీష్, సందీప్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

650-2, సర్వే నెంబర్‌లో అక్రమ కట్టడాలను తొలగించాలి

కబ్జాదారులపై 420 కేసులు నమోదు చేయాలి

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో 650-2,సర్వే నెంబర్ లో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్స్ కార్మికులు ఎవరైతే వున్నారో వారికీ చాలా అన్యాయం జరిగింది అని,అర్హులైన కార్మికులకు పట్టాలు ఇవ్వకుండా అనర్హులైన వారందరికీ పట్టాలు ఇచ్చి అర్హులైన కార్మికుల్ని రోడ్డున పడేశారు అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏఐటియుసి కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, సిపిఐ పట్టణ కార్యదర్శి పూల శెట్టి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మూడు నెలలుగా ధర్మవరం పట్టణంలో 650-2,సర్వే నెంబర్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను కోరామని, ర్యాలీలు, ధర్నాలు, చేయగా రెవెన్యూ అధికారులు స్పందించి కార్మికుల దగ్గరకు వచ్చి న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తామని, 650-2 సర్వే నెంబర్ లో అనర్హులైన వారి పట్టాలను రద్దుచేసి ఎవరైతే నిజమైన కార్మికులు ఉన్నారో వారికి వెంటనే పట్టాలు మంజూరు చేస్తామని డిప్యూటీ తాసిల్దార్ సురేష్ హామీ ఇచ్చారన్నారు. విచారణ చేసి 650-2,లో నకిలీ పట్టాలను కూడా రద్దు చేశారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే చర్యలు చేపట్టి అక్కడ నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించి ,అన్యాక్రాంతం చేసిన వారిపై 420 కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్మికుల కి పట్టాలిచ్చి వారికి న్యాయం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్స్ కార్మిక సంఘం అధ్యక్షులు, గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, ఆదినారాయణ, తాజుద్దీన్,రామకృష్ణ, రామసుబ్బయ్య, మసూద్, సురేంద్ర,నాగేంద్ర, చిన్న,జనార్దన్, వేణు గోపాల్, షెక్షావలి, గౌస్ లాజం, ఓబులేసు, మహిళా సమైక్య నాయకులు లలితమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

యోగాసనాల ముద్రికలు పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, కళాశాల క్రీడా మైదానంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆదర్శ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో మహేష్ చేతులమీదుగా యోగాసనాల ముద్రి కాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు పర్యావరణం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు. చెట్లను నరకడం, పర్యావరణానికి హాని కలిగించే వాటికి దూరంగా ఉండా లని తెలిపారు. పర్యావరణం సరిగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా సక్రమం గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆదర్శ సేవా సంఘం అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు సూర్య ప్రకాష్, కార్యదర్శి గుద్దిట్టి నాగార్జున, సూర్య నాగరాజు, నాగసముద్రం నాగభూషణ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో గత 33 రోజులుగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయని గ్రంథాలయ అధికారిని ఆంజనేయ సౌభాగ్యవతి తెలిపారు. వివిధ అంశాలలో శిక్షణ పొందిన విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశామన్నారు. డ్రాయింగ్స్, జనరల్ నాలెడ్జ్, కథలు చెప్పడం, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, డాన్స్ యోగ అంశాలలో శిక్షణ ఇచ్చామని, ముఖ్య అతిథులుగా ఓబయ్య, మేనేజర్ సుకుమార్, రంగనాథ్, మేడ రవి, టీచర్ ముత్యాలప్ప, మురళి,ఎల్ఐసి నాగరాజు చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ శిక్షణలో 35 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణా నాయక్, శివమ్మపాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించండి

కలెక్టర్‌కు విన్నవించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ కు ఏపీయూడబ్ల్యూజే నాయకులు విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా భావించి ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా, ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో అహర్నిశలు తమ వంతుగా పాత్ర పోషిస్తున్నారని, అరకొర గౌరవ వేతనాలతో కొందరు, ఎటువంటి గౌరవ వేతనాలు అందక మరికొందరు మీడియా సంస్థలలో దుర్భరమైన జీవితాలను వెళ్ళదీస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఈ జిల్లాలో మీడియా ప్రతినిధుల ఆర్థిక దుస్థితి వర్ణనాతీతం. ఆర్థిక ఇబ్బందులతో పాటు మరెన్నో సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న జర్నలిస్టుల వారి పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్య సంస్థలలో ఉచిత విద్యను అందించే విధంగా తగిన చొరవ చూపి జర్నలిస్టుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరంలో జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా మీరు తీసుకున్న చొరవ పట్ల మేమందరం ఎంతో సంతోషిస్తున్నా మని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ఏడాది నుండి జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే జిల్లా విద్యాధికారి క్రిష్టప్పను పిలిపించి, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలలో అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ స్టాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట

విశాలాంధ్ర-కదిరి : పట్టణంలోని స్థానిక ఫైర్ స్టేషన్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం పండిస్తున్న పంటలకు సేంద్రియ ఎరువులు వాడకం తగ్గించి ఎక్కువ శాతం మందులు వాడడంతో ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రకృతి సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూర గాయల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్య మన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇలాంటి పకృతి సేంద్రియ పంటలు పండిస్తూ వాటిని వినియోగంలోకి తీసుకరావా లని కోరారు.నెలల జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమస్య పరిష్కారం చేయక పోతే దశల వారి ఆందోళన కార్యక్రమాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు వేమారెడ్డి, నాగప్ప, సుధామణి, తిప్పమ్మ, ఆదినారాయణ, పాల్గొన్నారు.

వాసవి కళాశాల విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర- ధర్మవరం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన పట్టణంలోని వాసవి కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం వివిధ కేటగిరీల కింద ప్రతిభా పురస్కారాలను ప్రకటించిందని వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 39 మందికి ఈ అవార్డు ఎంపికయ్యారని., ధర్మవరానికి చెందిన వాసవి జూనియర్ కళాశాలకు చెందిన బీసీ కేటగిరికి చెందిన శాంతియ బైపిసి లో 987 మార్కులు, జనరల్ కేటగిరీలో అరిగెల దివ్య బైపీసీలో 984, ఎస్సీ కేటగిరిలో మౌనిక ఎంపీసీలో 979 మార్కులు, దివ్యాంగుల విభాగంలో షేక్ నాజియా సీఈసీ లో 832 మార్కులను కైవసం చేసుకున్నారన్నారు. విద్యార్థినీలను ప్రిన్సిపాల్ డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులు కూడా అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పుట్టపర్తి రోడ్, సాయి నగర్లో గల శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఆలయ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు తెల్లవారుజామున 5 గంటల నుండి మధ్యాహ్నం వరకు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ త్రిపుర సుందరీ దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ప్రతిష్టాపన కార్యక్రమాలను శిరిడి సాయి సేవా సమితి వారు ఘనంగా నిర్వహించారు. శిరిడి స్వామి విగ్రహం జరిగి 25 సంవత్సరాలు జరిగిన శుభసందర్భంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రధాన పురోహితులు వేదమూర్తి బ్రహ్మశ్రీ పంచాంగం నాగ ప్రసాద్ శర్మ వారి శిష్య బృందం చే నిర్వహిం చామని కమిటీ వారు తెలిపారు. రక్షాగ్ని జ్వాల దర్శన దేని దర్శన గోవు దర్శన స్వామివారికి పంచామృతాభిషేకం రుద్రాభిషేకం, సమస్త దేవతల మూల మంత్ర హెూమాలను ఘనంగా నిర్వహించారు. 5 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు, టిడిపి సీనియర్ నాయకుడు పరిసే సుధాకర్, సేవా సమితి వీరనారాయణ ,రామలింగయ్య ,సూర్య ప్రకాష్ రాంప్రసాద్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చుదాం

విశాలాంధ్ర-కదిరి : ప్రపంచాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చుదాం.. మొక్కలు నాటి మార్గం చూపిద్దామని తహసీల్దార్ మురళీ కృష్ణ, ఎంపీడీఓ పోలప్ప పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు మొటుకుపల్లి, ఎర్రదొడ్డి, కుమ్మరవాండ్ల పల్లిలో చెట్లు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెట్లే మన భవిష్యత్‌కు బాసటని, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రిం చాలంటే ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటి పెంచా లన్నారు. మన భూమిని రాబోయే తరాలకు ఆరోగ్యంగా అందించాలంటే ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రపంచం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడమే ఈ రోజు కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు వీలైనంతగా తగ్గించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పర్యావరణ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర - అగళి : ఇటీవల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అగళి మండలం నుంచి 150 మంది కంటిజబ్బు ఉన్నవారిని గుర్తించి బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి కి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించుకుని వచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జడ్పిటిసి ఉమేష్ ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

అంతరాయం లేకుండా విద్యుత్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం డివిజన్లో ఇకపై అంతరాయం లేకుండా సక్రమమైన విద్యుత్తును అందిస్తా మని విద్యుత్ సిజిఎం వరకుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ నుండి అనేక ఫిర్యాదు వచ్చాయని, విద్యుత్తు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ డివిజన్లోని సబ్ స్టేషన్ లను, వివిధ విద్యుత్ కార్యాలయాలను తనిఖీ చేశామని తెలిపారు. తదుపరి ధర్మారం డివిజన్లో గాలి వానకు విద్యుత్తును ఆపడం జరుగుతోందని, అలాకాకుండా వాటి నివారణకు చేపట్టాల్సిన అంశాలపై అధికారులకు సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రమాదకర విద్యుత్తు పరికరాలు, ట్రాన్సుఫారంలను వెను వెంటనే పది రోజులలో నివారించాలన్న ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. పాత ట్రాన్సుఫారాలకు మరమ్మత్తులు , కొత్త ట్రాన్స్‌పార్మర్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. వినియోగ దారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు అని ఆదేశించారు. ప్రమాదకర పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్య ఉన్నచో కాల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫిర్యాదు చేయవచ్చునని, తప్పకుండా పరిష్కరిస్తామని వెల్లడించారు.

తాటిమానుగుంతలో తీవ్ర నీటి ఎద్దడి ..

కిలోమీటర్ నుండి నీటి బిందెలను మోస్తున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని పడమర నడిమిపల్లి పంచాయతీ తాటిమాను గుంత గ్రామంలో తాగునీటి కొరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజుల క్రితం పంచాయతీ బోరు మరమ్మతులకు గురైందని,అప్పటి నుండి కిలో మీటరు దూరంలోని వ్యవసాయ బోరు బావి నుండి నీటిని తీసుకువస్తున్నారు. పిల్లలు,వృద్దులు, మహిళలు అనే తేడా లేకుండా వ్యవసాయ భూములు గట్లపై నుండి పడుతూ, లేస్తూ అతి కష్టంపై తాగునీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సర్పంచ్ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకున్నదని, ఉన్నతాధికారులు చొరవ చూపి బోరు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుచున్నారు.

సిఐటియు నుండి ఏఐటీయూసీలో చేరికలు..

విశాలాంధ్ర-చిలమత్తూరు : చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ వర్కర్లు ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గురువారం సి ఐ టి యు నుండి ఏఐటీయూసీలో చేరడం జరిగింది, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కోడూరు పంచాయతీ వర్కర్లుకు ఐదు నెలల నుండి పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సర్పంచు మురళిని కోరారు. వారు స్పందిస్తూ 15 రోజుల్లో ఐదు నెలల జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈసమస్య పరిష్కారం చేయకపోతే దశల వారి ఆందోళన కార్యక్రమాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు వేమారెడ్డి, నాగప్ప, సుధామణి, తిప్పమ్మ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిరక్షణలో భాగస్వామ్యం కండి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సి పల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మంత్రి నియో జకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు అమ్మ పేరుతో ఓ మొక్క అనే కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది అని తెలిపారు. దీనిలో భాగంగా జూన్ 5 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణం అందించాలంటే, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక్క మొక్కను నాటి, దానిని పెంచడం ద్వారా ధర్మవరం పట్టణాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శాంసన్, కేశవ, వీరేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, ధర్మవరం పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మహిళా నాయకురాలు రాధమ్మ, మహాలక్ష్మి, నబి రసూల్ పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక..

విశాలాంధ్ర-ధర్మవరం: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 6 వ తేదీ నుండి 8వ తేదీ వరకు భీమవరంలో జరగనున్న 15వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలలో పాల్గొనే హాకీ జిల్లా జట్టును హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, సత్యసాయి జిల్లా సెక్రెటరీ బంధనాథం సూర్య ప్రకాష్, హాకీ జిల్లా అధ్యక్షులు బి.వి శ్రీనివాసులు పత్రికా ముఖంగా ప్రకటించారు. జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ జూన్ 1 వతేదీ ఆదివారం స్థానిక క్రీడా మైదానంలో జరిగిన విషయం విదితమే జట్టులో సభ్యులుగా సింధు, ప్రవిత, మధురిమా బాయ్, వైష్ణవి, హేమ,దివ్య, నసీమా, వర్ష,హర్షిత, నవ్యశ్రీ, దుర్గ, శివగంగా, శ్రీలేఖ, మోక్షిత, గుణశ్రీ, వరలక్ష్మి,ఉషశ్రీ, హర్షితలు ఎందుకైనారన్నారు. జట్టుకు కెప్టెన్‌గా సింధు, కోచ్, మేనేజర్లుగా మారుతీ కుమార్, అరవింద్ గౌడ్, వ్యవహరించనున్నారు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి, జిల్లా జట్టును విజేతగా నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాకీ సత్యసాయి జిల్లా సెక్రటరీ సూర్యప్రకాష్, సత్యసాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్,హాకీ సత్యసాయి జిల్లా జాయింట్ సెక్రెటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, ఉడుముల కిరణ్ సత్య సాయి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ హస్సేన్,పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్టుకు హాకీ సత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్,పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర,ట్రెజరర్ అంజన్న, డైరెక్టర్లు మారుతీ,అమునుద్దీన్, ఇర్షాద్, శుభాకాంక్షలు తెలియజేశారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి...

విశాలాంధ్ర-రొళ్ల: పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పరిశుభ్రంగా స్వచ్ఛంగా ఉండాలని ఎంఈఓ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో పనిచేసే డొక్కా సీతమ్మ గారి మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు వ్యక్తిగత శుభ్రత పరిసరాల శుభ్రత, వంటకు ఉపయోగించే పాత్రలు వాటి శుభ్రత పాటించాలని సూచించారు. మెనూలో ఉన్న అన్ని పదార్థాలను అందించాలన్నారు. మధ్యాహ్న వంట ఏజెన్సీలకు వంటల పోటీలు నిర్వహించగా అనితమ్మ మొదటి బహుమతి, రెండవ బహుమతి హెూట్టి బెట్టా ఉన్నత పాఠశాల ఏజెన్సీ వరలక్ష్మి మూడవ బహుమతి అలుపనపల్లి ఉన్నత పాఠశాల ఏజెన్సీ రాధమ్మకు ఎంఈఓ అందించారు.

విత్తన వేరుశనగ కాయలకు సిద్ధంకండి

విశాలాంధ్ర-కదిరి : విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వ్యవసాయ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సందర్భంగా కే-6, టిసిజీయస్-1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,790, 40 శాతం సబ్సిడీ పోనూ బస్తా ధర రూ.1,674 కదిరి లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,460 కాగా, సబ్సిడీ పోనూ రూ.1,476 చెల్లించాలని తెలిపారు. అర ఎకరం వరకు (30 కేజీలు) బ్యాగ్, అర ఎకరం నుంచి ఎకరం వరకు 2 బ్యాగులు, ఎకరం నుంచి ఆపైన భూమి ఉన్న రైతులకు 3 బ్యాగులు గరిష్టంగా పంపిణీ చేస్తామన్నారు.

రేషన్ షాప్ వద్ద సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-రొళ్ల: ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు రేషన్ షాప్ ల వద్ద సరుకులు పంపిణీ చేపట్టినట్లు టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, కుంచిటిగా ఒక్కలిగా రాష్ట్ర సాధికార కన్వీనర్ వి.యం పాండురంగప్ప,తెదేపా మండల ప్రధాన కార్యదర్శి జి.కె ఈరన్న,క్లస్టర్ ఇంచార్జ్ భరత్,మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప,కోఆర్డినేటర్ రామకృష్ణ, కల్లురొప్పం రవికుమార్ గౌట్టుగురికి శ్రీనివాస్, రంగప్ప ప్రకాష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. పారదర్శకంగా రేషన్ షాపుల వద్దనే నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వికలాంగులకు వృద్ధులకు వారి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. ప్రతి డీలరు కార్డు లబ్ధిదారులకు తగిన న్యాయం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఆరోపణలపై చర్చకు సిద్ధమా.. ?

విశాలాంధ్ర-అమరాపురం : మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై సోషల్ మీడియా వేదికగాచేసిన అవినీతి ఆరోపణలను చర్చించడానికి బహిరంగ చర్చకు సిద్ధమా అని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పని మడకశిర నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తిలు సవాల్ విసిరారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. స్థానిక టీడీపీ కార్యాలయం లో టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చన్నప్ప గురు సిద్ధప్పతో కలసి గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తీసుకుని వచ్చిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిల హయాంలో చేపడుతున్న అభివృద్ధి మీ కళ్ళకు కనబడవా అని ప్రశ్నించారు. మడకశిర నియోజకవర్గంలో వైకాపా హయాంలో ఎంతో అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. ఈరలక్కప్ప ఇలాంటి నిరాధార ఆరోపణలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో లిడీలర్ నాగరాజు, టిడిపి నాయకులు నవీన్ కుమార్, రఘు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరాలు ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారిణి శాంతమ్మ బహుమతులను అందజేశారు. పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు పుస్తక పఠనం,సృజనాత్మకతతో కూడిన ఆటలు,మేధో వికాసం, విజ్ఞాన పుస్తకాలను విద్యార్థులతో చదివించి వారి మేధస్సును పెంపొందించే ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు,పెన్నులు బహుమతిగా అందించారు.

ప్రతిభ పురస్కారం అందుకున్న విద్యార్థిని

విశాలాంధ్ర-గుడిబండ: పదవ తరగతిలో 569 మార్కులు సాధించిన గుడిబండ గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి కుమార్తె చైత్రను హైకోర్టు లాయర్ శివరామకృష్ణ చేతుల మీదుగా ప్రతిభ పురస్కా రంతో సత్కరించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా విద్యార్థిని శాలువతో ఘనంగా సన్మానించారు

వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు

తాడిమర్రి, విశాలాంధ్ర : స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం గంథాలయ అధికారి డిసినా నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తు బంగారుమయం అవుతుం దని పేర్కొన్నారు. చిత్రలేఖనం, వక్తృత్వ వ్యాసరచన కథల పోటీల విజేతలకు వెటర్నరీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి టీచర్ రామకృష్ణ గ్రంథాల అధికారి శీనన్న పాల్గొన్నారు

ప్రతిభావంత ఎస్సీ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-అమరాపురం: మండల కేంద్రంలోని అంబేద్కర్ స్మృతి వనం నందు గురువారం అంబేద్కర్ యువక సంఘం ఉపాధ్యక్షుడు నాగోనపల్లి శివకుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ శ్రేణిలో మార్కులు సాధించిన ఎస్సీ విద్యార్థులకు మెమెంటో అందజేసి సన్మానించారు. అంబేద్కర్ మృతి వనంలో అంబేద్కర్ యువక సంఘం సభ్యులు సమక్షంలో శివకుమార్ మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విద్యార్థులకు మెమెంటో అందజేశామన్నారు. ముఖ్య అతిథులుగా నారాయణ, ప్రసాద్, తిప్పయ్య, బిజెపి హనుమంతప్ప, ఉప్పార్లపల్లిశివన్న, రామచంద్రప్ప, మంజు, హనుమంతరాయ శకునప్ప పాల్గొన్నారు. నాగోనపల్లి శివకుమార్ దంపతులకు జన్మదిన వేడుకల సందర్భంగాఅభిమానులు ఘనంగా సన్మానం చేసికేక్ కట్ చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-చిలమత్తూరు : హిందూపురం యార్కెట్ యార్డులో గురువారం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా అశ్వర్థనారాయణ రెడ్డి, చిలమత్తూరు జనసేన పార్టీ తరపున డైరెక్టర్‌గా నియమించబడ్డ అగ్గి శ్రీనివాసులు, టిడిపి నాయకుడు దిగువపల్లి పంచాయితీ బాలచంద్రనాయక్, దేమకేతేపల్లి పంచాయతీ డి.గొల్లపల్లి గ్రామ వాసి టిడిపి నాయకుడు శ్రీనివాసరెడ్డి సతీమణి లచ్చన్న గారి సుకన్యలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, హిందూపురం జనసేన పార్టీ ఇంచార్జి ఆకుల ఉమేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 06, జూన్ 2025

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగదు

విశాలాంధ్ర-అగళి : మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పై ఈరలక్కప్ప చేసిన అవినీతి ఆరోపణలను జడ్పీటీసీ ఉమేష్ మండల టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. చర్చించడానికి బహిరంగ చర్చకు సిద్ధమా అని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. గురువారం జడ్పీటీసీ ఉమేష్ బంగారు దుకాణం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా వైకాపా నాయకుడు ఈరలకప్ప చేసిన ఆరోపణలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మడకశిర నియోజకవర్గం గత ఐదు సంవత్సరాలు వైకాపా ప్రభుత్వంలో మీరు చేసిన అభివృద్ధిపై, అదేవిధంగా ఏడాది కాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమా అని వైకాపా నాయకులకు సవాల్ విసిరారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తీసుకుని వచ్చిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిల హయాంలో ప్రతి గ్రామం లోను అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుతున్న మీ కళ్ళకు కనబడవా అని ప్రశ్నించారు. మడకశిర నియోజకవర్గంలో వైకాపా హాయంలో అవినీతి అక్రమాలు జరిగాయని, నిస్వార్థ సేవకుడిగా ప్రజలకు తన వంతు సేవ చేస్తూ అన్ని వర్గాల వారిని ఆదరించిన ఎమ్మెల్యే రాజుపై అవినీతి మరకలు అంటించడానికి ప్రయత్నిస్తున్న ఈరలక్కప్ప ఇలాంటి నిరాధార ఆరోపణలను మానుకోవాలని హితవు పలికారు.కేవలం 18 రోజుల వ్యవధి లోనే ఎం ఎస్ రాజు ఎమ్మెల్యే గా గెలుపొందారంటే ఆది అతనిలో ఉన్నా మంచి తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు కూడా ప్రతి విషయాన్ని గమనిస్తున్నారనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జయప్ప మాజీ ఎంపీపీ నరసింహప్ప మాజీ సర్పంచ్ రవికుమార్ బీసీ సెల్ నాయకులు తిప్పేస్వామి,ఎస్సీ సెల్ అధ్యక్షులు భూతరాజు, నాయకులు మంజు చరణ్, కసాపురం శివన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టే చర్యలు మొదలవుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి తెలిపారు. పట్టణ ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే చర్యలు మొదలవుతాయన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎవరూ బొకేలను ఇవ్వరాదని అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనించాలన్నారు. ఎవరూ కూడా ప్లాస్టిక్ బొకేలను ఇవ్వరాదని పూలు, మొక్కలను అందించాలని, అధికారులు, ప్రజలు అందరూ కూడా దీనిని పాటించాలని కోరారు. ప్రభుత్వ సమావేశాల్లో అధికారులంతా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ లను వాడుతున్నారని, అలా కాకుండా ఎవరికి వారే స్టీల్ బాటిల్స్ లో నీరు తెచ్చుకోవాలన్నారు. అన్ని రకాల ప్లాస్టిక్ వాడకాన్ని దశలవారిగా నిర్మూలించడాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ ఉపయోగించని జీవన విధానాన్ని అధికారులు, ప్రజలు అలవర్చుకోవాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

గోవులను వధించడం చట్ట విరుద్ధమం

విశాలాంధ్ర-కణేకల్లు: హిందువులు పరమ పవిత్రంగా, దేవతగా, తల్లిగా భావించి గోమాతగా పిలవబడే గోవులను పండుగల పేరుతో వధించడం హిందువుల మనోభావాలను భంగం కలిగించడమేనని విశ్వ హిందూ పరిషత్ భావిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడం, చట్ట వ్యతిరేకంగా తరలించడం, బహిరంగ ప్రదేశాలలో పశువులను వధించడం లాంటివి చేయకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తూ విశ్వ హిందూ పరిషత్ శాఖ కనేకల్ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ వారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గోవుల అక్రమ రవాణా లేదా వధించడం లాంటి చర్యలను గమనించినప్పుడు ప్రజలు పోలీసులకు గాని లేదా డయల్ 100 కు గాని లేదా విశ్వ హిందూ పరిషత్ దృష్టికి గాని తీసుకురావాలని ఈ సందర్భంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ శాఖ కనేకల్ అధ్యక్షులు డోన్ రవి చంద్ర, ఉపాధ్యక్షుడు దత్త తిప్పేస్వామి , ప్రధాన కార్యదర్శి బారిక నాగరాజు, భజరంగ్ దళ్ సంయోజక్ రాచర్ల రమేష్, కోశాధికారి కురుబ మణికంఠ, భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్ కురుబ తిప్పేస్వామి మరియు కార్యవర్గ సభ్యులు డీ. మనోజ్, కే. వరుణ్, వై. రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

టీచర్స్ కోఆపరేటివ్ టీచర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ఎలిమెంటరీ టీచర్స్ కోఆపరేటివ్ టీచర్స్ సొసైటీ ఎన్నికలలో ఏపీటీఎఫ్ ప్యానెల్ కు చెందిన 7మంది డైరెక్టర్లు ఎన్నిక కావడం జరిగినది. వారు గురువారం ఎలక్షన్ అబ్జర్వర్ వన్నూరుస్వామి, ఆధ్వర్యములో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమై సొసైటీ గౌరవఅధ్యక్షులు, అధ్యక్షులు,కార్యదర్శు లను ఎన్నుకోవడం జరిగినది. సొసైటీ గౌరవ అధ్యక్షుడిగా అమీర్ వలి ను, అధ్యక్షులు గా రాజశేఖర్ ను , కార్యదర్శి గా జవ్వాజి నాగరాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.కొత్తగా ఎన్నికైన వారితో ఎలక్షన్ ఆఫీసర్ వన్నూరుస్వామి ప్రమాణ స్వీకారం చేయించడం జరిగినది. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం ఈ సంస్థ అభివృద్ధికి , పాత బకాయిలు వసూలుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ ఎన్నికలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు ,మరియు ప్రధాన కార్యదర్శి .చంద్ర మరియు సొసైటీ డైరెక్టర్లు . క్రిష్ణానాయక్ ,. రమేష్ బాబు , వెంకటరమణ నాయక్,రంగేష్ కుమార్ మరియు సీనియర్ కార్యకర్తలు కె.మల్లికార్జున , కె.రఘునాథరావు, యం. శ్రీనివాసులు , చంద్ర మౌళి, సంజీవరాయుడు, లక్ష్మ నాయక్ , గోకుల్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కళాశాల విద్యార్థులు మరియు పెనుకొండ మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ అయిన టి వాసుదేవన్ మరియు పిడిఎఫ్ సిఎం వజ్రప్ప , బార్ ప్రెసిడెంట్ వాల్మీకి శ్రీనివాసులు,కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, మరియు కళాశాల అధ్యాపకు బృందం పాల్గొని ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణ ఆరోగ్యం నినాదాలతో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు మరియు న్యాయవాదులు పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించడం జరిగింది అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కే సుదర్శన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్పిఓలు మరియు అధ్యాపక బృందం చే ట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగరాజు, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని నిర్మలిద్దాం

విశాలాంధ్ర - అగళి : విరివిగా మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పెంపొదిద్దామని ఎంపీడీఓ యాదవేంద్ర ఎ పి ఓ మంజునాథ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా రామనపల్లి, అక్కగారి దేవరపల్లి గ్రామాల్లో గురువారం చెట్లునాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం వారుమాట్లాడుతూ చెట్లే మన భవిష్యత్‌కు బాసటని, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటి పెంచాలన్నారు.రాబోయే తరాలకు ఆరోగ్యం అందించాలంటే ఇది ప్రతి పౌరుడి బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రపంచం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడమే ఈ రోజు కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దొక్కలపల్లి సర్పంచ్ మంజుల నటరాజు,సీనియర్ టిడిపి నాయకులు శ్రీనివాస్ ఆచారి,కృష్ణప్ప, కాంత రాజు,టెక్నికల్ అసిస్టెంట్ దేవగిరి, ఈరన్న, సచివాలయ సిబ్బంది,గ్రామ ప్రజలు ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద ఉన్న గ్రంథాలయంలో గురువారము శాఖ గ్రంథాలయ అధికారి రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్. వీరారెడ్డి, కె. సేతు, వి. సూర్యనారాయణ రెడ్డి పెన్షన్ సంఘం అధ్యక్షులు పి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రవికుమార్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చిన్నతనము నుండి గ్రంథాలయమునకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో - ఒక మంచి పుస్తకం కొనుక్కో అని ఒక మంచి మాటతో పుస్తకం విలువను పుస్తకం ఆవశ్యకతను గురించి తెలుపుతూ - పుస్తకము ఒక మంచి నేస్తం అన్నారు. నేటి చరిత్ర భావితరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకం, అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానమనే జ్యోతిని మనలో వెలిగించి ముందుకు నడిపేసాధనమే పుస్తకమని తెలియజేశారు. అనంతరం వేసవి శిక్షణా తరగతులలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తీసివేయాలి

విశాలాంధ్ర-నార్పల: మండల పరిధిలోని పవిత్రమైన గూగూడులో మద్యం, జూదం గురించి పత్రికల్లో వార్తలు వచ్చాయని ఆధ్యాత్మిక కేంద్రం గురించి అటువంటి వార్తలు ప్రచురించకపోవడం మంచిదని రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రమైన గుగూడు గురించి భక్తులకు మరొక విధంగా సమాచారం వెళ్తుందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అధికారుల సమక్షంలో కోరిన గ్రామస్తులు, ఆధ్యాత్మిక కేంద్రమైన గూగూడులో మద్యం విక్రయాలు శాశ్వతంగా తీసివేయాలని కోరక పోవడం బాధాకరం అని పలువురు కుల్లాయ స్వామి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేరుశెనగ విత్తన పంపిణీ

విశాలాంధ్ర-ఆత్మకూరు: ప్రభుత్వ సబ్సిడీతో అందజేస్తున్న వేరుశెనగ విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలోని పంపనూరు గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పంపనూరులో ఏర్పాటు చేసుకోవడం హర్షదాయకమన్నారు. జిల్లాకు ఈ సీజన్ కు సంబంధించి 50,592 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాన్ని కేటాయించడం జరిగిందన్నారు. గతేడాది 40 శాతం ఎక్కువగా వర్షం జిల్లాలో వచ్చిందని, సకాలంలో రాకపోయినా కురిసిన వర్షం వల్ల భూగర్భజలం పెరిగిందని, ఈ ఏడాది కూడా 40 శాతం ఎక్కువ వర్షం వస్తుందని శాస్త్రవేత్తలు చెప్పారని, సకాలంలో వర్షం రావాలని కోరుకుంటున్నామన్నారు. వ్యవసాయ శాఖ గురించి చాలా విలువైన సలహాలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇస్తూ ఉంటారని, ఎమ్మెల్యే స్వతహాగా రైతు అని, పంటలు సాగు చేస్తూ ఉంటారని, వ్యవసాయంకు సంబంధించి వారు చాలా విలువైన సలహాలు, సూచనలు, మార్గదర్శనం ఇస్తూ ఉంటారని, వాటిని జిల్లా మొత్తం అమలు చేస్తామని, ఇందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వేరుశెనగ లోడ్ గ్రామ స్థాయికి వచ్చినప్పుడు వ్యవసాయ అధికారులు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో 14 ప్రాసెసింగ్ కేంద్రాలు ఉండగా, వాటికి ప్రత్యేక అధికారులను నియమించాలని, విత్తన ప్రాసెసింగ్ ను ర్యాండంగా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. గ్రామస్థాయిలో కూడా విత్తనాలను తనిఖీ చేయాలని, క్షేత్రస్థాయిలో విత్తన పంపిణీని అధికారులు పరిశీలించాలన్నారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలలో కూడా పరిశీలన చేయడం జరుగుతుందని, వ్యవసాయ అధికారులు పంటల సాగు చేసుకోవడంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. వేరుశనగ విత్తనం 30 కేజీల బ్యాగును 0-0.5 ఎకరాల వరకు ఒకటి, 0.5-1 ఎకరం వరకు రెండు, 1.01 నుంచి ఆపైన ఉన్న ఎకరాలకు సంబంధించి మూడు బ్యాగులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జిల్లాలో రాబోయే ఖరీఫ్-2025 సీజన్‌లో 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతోందని, విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా మూడు సంచులను పంపిణీ చేయాలని ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. 30 కేజీల ఒక బ్యాగ్ పూర్తి ధర 2,790 రూపాయలు కాగా, అందులో 1,116 రూపాయల సబ్సిడీ పోను రైతు 1,674 రూపాయల చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30 కేజీల 2 బ్యాగ్ ల పూర్తి ధర 5,580 రూపాయలు కాగా, అందులో 2,232 రూపాయల సబ్సిడీ పోను రైతు 3,348 రూపాయల చెల్లించాల్సి ఉంటుందని, అలాగే 30 కేజీల 3 బ్యాగ్ ల పూర్తి ధర 8,370 రూపాయలు కాగా, అందులో 3,348 రూపాయల సబ్సిడీ పోను రైతు 5,022 రూపాయల చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఖరీఫ్ లో వర్షం వస్తే పంటలు వేయాలని రైతన్నలు వేయికన్నులతో ఎదురుచూస్తున్నారని, వేరుశనగ విత్తనాలను రైతులు బాగున్నాయా లేదా అని నాణ్యత చూసి తీసుకోవాలన్నారు. నాణ్యత బాగుంటే తీసుకోవాలని లేకపోతే వెనక్కి ఇవ్వాలన్నారు. జిల్లాకు 50,592 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాన్ని కేటాయించడం జరగగా, విత్తన కేటాయింపు తక్కువగా వచ్చిందని, ఇంకా విత్తనం కూడా అవసరం అవుతుందని, రైతులు కూడా విత్తనాలు అడుగుతున్నారని, ఎక్కువ కూడా విత్తనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది కూడా జిల్లాకు విత్తనం తక్కువగా వచ్చిందని, ఇంకా ఎక్కువ విత్తనం కావాలని సంబంధిత మంత్రి గారిని కూడా అడగడం జరిగిందని, జిల్లా కలెక్టర్ కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన ఎక్కువ విత్తనం వచ్చేలా చూడాలని కోరారు. లోటు లేకుండా రైతులకు అవసరమైన విత్తనాన్ని పంపిణీ చేయాలన్నారు. విత్తనాలు పక్కదారి పట్టకుండా చూడాలని, ఎవరికైతే ఉపయోగపడుతుంతో ఆ రైతులు మాత్రమే వేరుశెనగను తీసుకోవాలన్నారు. అవసరం లేకుండా విత్తనం తీసుకొని పక్కన అమ్ముకునేలా చేసుకోరాదని సూచించారు. అనంతరం రైతులకు వేరుశనగ విత్తనాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్డీసి రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ రవి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, ఏవోలు సోమశేఖర్, శ్రీవాణి, రాకేష్, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు

పూలే అంబేద్కర్ ప్రతిభ పురస్కారాలు

విశాలాంధ్ర-పెనుకొండ: ఉత్తమమైన ఆశయాలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని గుట్టూరు గ్రామంలో హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ జన్మదిన వేడుకలు ఆయన నివాసం వద్ద బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సర్వమత గురువులు ప్రార్థనలతో దీవెనలు అందుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గుట్టూరులో శివరామకృష్ణ నివాసం వద్ద నిర్వహించిన జన్మదిన వేడుకలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పూలే అంబేద్కర్ ప్రతిభ పురస్కారాల మహోత్సవం నిర్వహించి 50 మంది విద్యార్థిని,విద్యార్థులకు శాలువాలు కప్పి పురస్కారాలు మెమెంటోలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బహుజన చైతన్య వేదిక ద్వారా శివరామకృష్ణ అనేక సేవాక్రమాలతో ప్రజల హృదయాలలో నిలిచారని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేసే ప్రజానాయకుడు శివరామకృష్ణ అని కొనియాడారు. శివరామకృష్ణ మాట్లాడుతూ 18వ శతాబ్దంలోనే పూలే దంపతులు విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని బడుగు బలహీన వర్గాలను చైతన్యపరిచి విద్యాభివృద్ధికి కృషి చేశారని, అంబేద్కర్ అనేక రకాలుగా వివక్షతకు గురైనప్పటికీ విద్యతోనే జ్ఞానం అని చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఇలాంటి వారి అడుగుజాడల్లో మనం పయనించాలని, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలతో చదివి అత్యున్నత స్థాయికి చేరాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. చామలూరు రాజగోపాల్, దాసానిపల్లి కొల్లాయప్ప, ఉమ్మర్ ఫారూఖ్, బహుజన చైతన్య వేదుక బృందం, రవి, రొద్దం బాబు, హిందూపురం నాగార్జున, ఆనంద్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఈశ్వర్, సోమం దేపల్లి సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప,ఆంధ్రూస్, క్రిస్టఫర్, కొల్లప్ప, బి.మారుతి ప్రసాద్ ,బోయ బాబు, లక్ష్మనాయక్, విద్యార్థులు తల్లిదండ్రులు,చైతన్య వేదిక సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి ముందుకు రావాలి

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని వానవోలు రహదారి సమీపంలోని మల్లెల రాతిగుట్టపై గల ప్రాచీన గుడులను పునర్నిర్మించడానికి పరిసర గ్రామాల ప్రజలు ముందుకు రావాలని చరిత్రకా రుడు మైనా స్వామి పిలుపునిచ్చారు. గోరంట్ల, మల్లెల, వానవోలు, గుంటిపల్లి తదితర గ్రామాలకు చెందిన కొందరితో కలిసి చరిత్రకారుడు మల్లెల రాతిగుట్టపై గల రెండు ప్రాచీన ఆలయాలను గు రువారం నాడు సందర్శించారు. ధన దురాశపరులు నిధుల అన్వేషణ పేరుతో గర్భగుడి మరియు మహా మండపంలలో సుమారు 6నుంచి 8 అడుగుల గుంతలు తవ్వి ఉండడాన్ని సందర్శకులు చూసి ఆవేదన చెందారు. ఇటువంటి ప్రాచీన ఆల యాల్లో గుప్త నిధులు ఉండే అవకాశమే లేదని మైనాస్వామి చెప్పారు. రెండు గర్భగుడులు మూల విగ్రహాలు లేక వెలవెలబోతున్నాయి. విజయనగర ఆలయ నిర్మాణ శైలికి చెందిన రెండు ఆలయాలు చక్కగా ఉన్నప్పటికీ గోడలు పగలగొట్టి,గుంతలు తవ్వి దుండగులు ధ్వంసం చేశారు. రాతిగుట్ట తూర్పు వైపున ఉన్న రెండవ వెంకటపతి దేవరా యల సామాన్య శకం 1638నాటి శాసనం ఆల యాల చరిత్రను, భూముల దానాలను, ఆలయ నిర్వహణ వంటి విషయాలను తెలుపుతున్నట్టు చరిత్రకారుడు వివరించారు. మల్లెల పరిసరాల గ్రామాల ప్రజలు ముందుకు వస్తే ఆలయాల పునర్నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణకు తాను కృషి చేస్తానని మైనా స్వామి పేర్కొన్నారు. ప్రజలు సహకరిస్తే దేవాలయాల సమీపంలో తాను ఒక యోగ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని ఎస్వీ వీఎం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ భక్తవత్సలం చెప్పారు. గుంటిపల్లి వెంకట శివారెడ్డి, సత్యనారాయణ రెడ్డి,వానవోలు బాలకృష్ణ, గోరంట్ల మస్తాన్ దేవాలయాలను సందర్శించిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లు గ్రంథాలయం లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కమ్మన్న ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ కార్యక్రమం గ్రంథాలయ భవనం లో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా డాక్టర్ కే శ్రీధరన్ గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత సుప్రసిద్ధ చిత్రకారుడు, వెంకటేశ్వరరావు అధ్యాపకులు ఎస్ కే పి జూనియర్ కళాశాల, బి కుల్లాయప్ప, తెలుగు భాష అధ్యాపకులు శంకరనంద జూనియర్ కళాశాల, వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ శంకరనంద జూనియర్ కళాశాల, గంగరాజు విశ్రాంత ఉపాధ్యాయులు, శాంత పాల్ , తెలుగు భాష శిక్షకులు విశ్రాంత ఉపాధ్యాయులు, భువనకుమార్, ఆంగ్ల భాష శిక్షకులు, ప్రతిభా వికాస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, రమేష్, డాన్స్ మాస్టర్, పాఠశాల ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎం కళ్యణ్ కుమార్ తెలుగు భాష శిక్షకులు కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ గత 40 రోజుల నుండి విద్యార్థిని విద్యార్థులకు అనేక అంశాలపైన డ్రాయింగ్ గణితం స్పోకెన్ ఇంగ్లీష్ తెలుగు వ్యాకరణం డాన్స్ మరియు యోగ అవగాహన శిక్షణ వారికీ పుస్తక పఠన అభిరుచిని పంపొడిస్తూ పోటీ తత్వం పెంపొడించే క్రమం లో చిత్ర లెకణం, వ్యాసరచన, మరియు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడమే కాక ప్రతి విద్యార్థిని విద్యార్థుల ను ప్రోత్సహిస్తూ బహుమతులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన శిక్షకులను గ్రంథాలయాధికారి ఘనంగా సత్కరించి శాలువాతో సన్మానిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎం హేమలత గ్రంథాలయంధికారిణి,సిబ్బంది సి రాము పాఠకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: 25 రోజులుగా స్థానిక మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బాబా ప్రసాద్, అర్డీటీ సీఈఓ నాగరాజు మాట్లాడుతు మనిషి సంపాదన దాచుకోగలడేమో గానీ జ్ఞానాన్ని దాచిపెట్టలేడన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలకు బొమ్మలు గీయడం, యోగ, స్వచ్ఛ ఆంధ్రపై వ్యాస రచన రాయడం, క్విజ్, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఆర్డీటీ టీచర్ బసవరాజు తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని బందూరు, గోవిందవాడ ,దేవగిరి క్రాస్ గ్రామాల్లో క్రిస్టల్ ప్రైవేట్ కంపెనీ సహకారంతో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు. చెట్లను నాటడమే కాదు వాటిని సంరక్షించుకొని బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు.క్రిస్టల్ కంపెనీ అధికారులు నబీర్, చంద్రకాంత్ ,సాయిబాబా, శివరాం రెడ్డి, రాజశేఖర్, అంజి, శివ, వన్నూరు స్వామి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: మండలంలోని కసాపురం గ్రామంలో నెట్టి కంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం వనం - మనం కార్యక్రమంలో భాగంగా ఈవో కే వాణి ఆధ్వర్యంలో దేవస్థాన పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం జరిగింది. ఆలయ చైర్మన్ కె.సుగుణమ్మ, సహాయ కార్యనిర్వహణాధి ఓ.వెంకటేశ్వరుడు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై సచివాలయ సిబ్బందికి పోటీలు

విశాలాంధ్ర-పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెనుకొండ మండలంలోని అన్ని గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు మండల స్థాయిలో పోటీలు శుక్రవారం నిర్వహించనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరేష్ కృష్ణ ప్రకటనలో తెలిపారు, వీరందరూ మండల పరిషత్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు పోటీ నిర్వహించబడునని కావున గ్రామస్థాయి పోటీలలో గెలుపొందిన విజయతలందరూ హాజరుకావాలని కోరారు.

గృహప్రవేశ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రమైన గుడిబండ గ్రామంలో ఈడిగ ఉమేష్ రమాదేవి దంపతులు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో గల రాజీవ్ కాలనీలో ఉమేష్ రమాదేవి దంపతులు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఉమాదేవి దంపతులను కుటుంబ సభ్యులను ఆశీర్వదించి యోగక్షేమ సమాచారము అడిగి చేసుకున్నారు. రోద్దం మాజీ జెడ్పిటిసి చెన్నప్ప, గుడిబండ ఎంపీటీసీ వనజ శశిధర్,నాయకులు శ్రీనివాస్ పరశురాం గంగాధర్ శ్రీకాంత్, హెూటల్ మల్లికార్జున దినేష్ జనార్ధన్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-యాడికి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. యాడికి మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో శ్రీ వెంకటేశ్వర మండల సమైక్య వెలుగు కార్యాలయం ఆవరణలో పర్యావర ణ దినోత్సవం సందర్భంగా ఏపీఎం చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో గురువారం మొక్క లు నాటారు. సందర్భంగా ఆయన మాట్లాడు తూ మొక్కలు నాటడంతో అవి చెట్లుగా ఎదిగి కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను వదులుతాయన్నారు. వాతావరణం కలుషితం కాకుండా చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు.సిసి రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పుల్లయ్య, ప్రియాంక, అరుణ ,లక్ష్మీదేవి పాల్గొన్నారు.